సాక్షి వరంగల్

గురువారం | 13 | ఫిబ్రవరి | 2025



రన్నింగ్ స్టాఫ్ సమస్యలు పరిష్కరించాలి - 8లో▸

రైల్వేలో రన్నింగ్ స్టాఫ్ సమస్యలు పరిష్కరించాలని ఏఐఎల్ఆర్ఎస్ఏ సెంట్రల్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ హనుమయ్య డిమాండ్ చేశారు.



పవర్‌ఫుల్!

ఈ వేసవిలో విద్యుత్ వినియోగం భారీగా పెరగనుందనే ఆలోచనతో టీజీ ఎన్పీడీసీఎల్ ప్రత్యేకంగా వేసవి ప్రణాళిక రూపొందించింది. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 35⁰/18⁰

జిల్లాలో ఉదయం నుంచి సాధారణ వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం వేళ ఎండ ఎక్కువ ఉంటుంది. సాయంత్రం సమయంలో ఆహ్లాదకరంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా రవి



వర్ధన్నపేట: కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన తూల్ల రవి నియమితులయ్యారు. ఈ మేరకు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు చేతుల మీదుగా బుధవారం ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలను గుర్తించి తనకు ఈ పదవి కట్టబెట్టినందుకు మరింత బాధ్యత పెరిగిందన్నారు. నాయకులు కమ్మగోని ప్రభాకర్, అనిమిరెడ్డి కృష్ణారెడ్డి, నరుకుడు వెంకటయ్య, మల్లెపాక సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్: వరంగల్, హనుమకొండ జిల్లాల అథ్లెటిక్స్ అసోసియేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీన హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపికలను నిర్వహిస్తున్నట్లు వరంగల్ అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఊర యుగేందర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-14, 16, 18, 20 బాలబాలికలకు పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఇందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను 18, 19వ తేదీల్లో ఉస్మానియా యూనివర్సిటీలో జరగనున్న 11వ తెలంగాణ రాష్ట్ర యూత్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌నకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 98665 64422 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

మంత్రి దామోదరను కలిసిన 102 సిబ్బంది

వర్ధన్నపేట: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను 102 అంబులెన్స్ డ్రైవర్స్ అసోసియేషన్ నాయకులు హైదరాబాద్‌లో బుధవారం కలిశారు. ఈ సందర్భంగా నాయకులు తోట సాగర్, సముద్రాల మధు మాట్లాడుతూ ఉద్యోగ భద్రత, నాలుగు రోజులకు ఒకసారి సెలవు, ఓటీల గురించి చర్చించినట్లు తెలిపారు. సమస్యలపై లిఖిత పూర్వకంగా వినతిపత్రం అందజేయగా మంత్రి సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. తమ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని, మళ్లీ ఒకసారి తనను కలవాలని మంత్రి సూచించినట్లు తెలిపారు.

మానవ అక్రమ రవాణా అరికట్టాలి

నర్సంపేట: మానవ అక్రమ రవాణా అరికట్టాలని నర్సంపేట ఆర్డీఓ ఉమారాణి అన్నారు. మానవ అక్రమ రవాణా, వెట్టిచాకిరి నిర్మూలనకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆర్డీఓ కార్యాలయంలో బుధవారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ సినిమాల్లో అవకాశాలు కల్పిస్తామని, ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి వ్యభిచార గృహాలు, వెట్టిచాకిరి, బిచ్చమెత్తడానికి అమ్ముతున్నారని తెలిపారు. 1930, 181, 1098, 112 టోల్‌ఫ్రీ నంబర్లకు ఉచితంగా ఫోన్‌చేస్తే వెంటనే ఆయా నేరాలను అరికట్టవచ్చని ప్రజలకు అవగాహన కల్పించే విధంగా స్వచ్ఛంద సంస్థలు కృషి చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రతిభ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు గిరగాని సుదర్శన్‌గౌడ్, స్వయంకృషి స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు బెజ్జంకి ప్రభాకర్, వెంకటాచారి, నరేశ్, సిబ్బంది వెంకట్ పాల్గొన్నారు.

30 శాతం నిధులు కేటాయించాలి

నర్సంపేట: కాంగ్రెస్ ప్రభుత్వం విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం సిగ్గుచేటని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అలవాల నరేశ్ అన్నారు. పట్టణంలో బుధవారం జరిగిన డివిజన్ కమిటీ సమావేశంలో నరేశ్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగం అభివృద్ధి, విద్యార్థుల సంక్షేమంపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా తక్షణమే విద్యాశాఖ మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో విద్యారంగానికి బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయించాలని, మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయాలన్నారు. విద్యాహక్కు చట్టానికి భిన్నంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన డిటెన్షన్ విధానాన్ని ఉపసంహరించుకోవాలని, మోదీ ప్రభుత్వం యూనివర్సిటీల స్వయంప్రతిపత్తిని దెబ్బతీసేందుకు తీసుకొచ్చిన యూజీసీ ముసాయిదా-2025ను వ్యతిరేకిస్తూ తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం చేయాలని కోరారు. పీడీఎస్‌యూ డివిజన్ నాయకులు జగన్, అభినవ్, సాగర్, సంతోష్, మధు, రామకృష్ణ పాల్గొన్నారు.

కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



హాజరైన భక్తులు



గోవిందా.. గోవిందా

- సన్నూరులో వేడుకగా వేంకటేశ్వరస్వామి కల్యాణం
- ఆలయంలో పూజలు చేసిన ప్రజాప్రతినిధులు, భక్తులు

మండలంలోని సన్నూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం వేంకటేశ్వరస్వామితో అలివేలుమంగ, పద్మావతి కల్యాణాన్ని అర్చకులు కనులపండువగా నిర్వహించారు. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, భక్తులు పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం గోవిందనామస్మరణతో మార్మోగింది. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. – రాయపర్తి

సిజేరియన్లతో కలవరం

మూడేళ్లలో పెరిగిన ఆపరేషన్లు

- జిల్లాలో 22,499 శస్త్రచికిత్సలు.. 9,205 సాధారణ ప్రసవాలు
- ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఆందోళన కలిగిస్తున్న కత్తెర కాన్పులు
- ప్రజల్లో మార్పు రావాలని ప్రభుత్వ వైద్యుల సూచన





సాక్షి, వరంగల్: జిల్లాలో సిజేరియన్లు కలవరపెడుతున్నాయి. గత మూడేళ్లలో 31,704 మంది ప్రసవమైతే.. ఇందులో 22,499 సిజేరియన్లు, 9,205 సాధారణ ప్రసవాలు నమోదయ్యాయి. ప్రైవేట్ ఆస్పత్రుల్లోనే అత్యధికంగా 11,956 సిజేరియన్లు చేయడం ఆందోళనకు గురిచేస్తోంది. మూడేళ్లలో 9,205 నార్మల్ డెలివరీలు ఉండగా.. 2017 మాత్రమే ప్రైవేట్ ఆస్పత్రుల్లో జరిగాయి. కాసులకు కక్కుర్తిపడి ప్రైవేట్ ఆస్పత్రులు సిజేరియన్ల వైపు మొగ్గు చూపుతున్నాయనే చర్చ జరుగుతోంది. ప్రసవ నొప్పులు తట్టుకోలేక సిజేరియన్ చేయాల్సిందేనని పట్టుబట్టే వారి సంఖ్య కూడా పెరుగుతోంది. పిల్లలు మంచి రోజుల్లో పుట్టాలని ముహూర్తాలు పెట్టించుకుని ఆపరేషన్లు చేయించుకోవడం, పెళ్లిరోజు వంటి ప్రత్యేక తేదీల్లో పుట్టాలని కోరుకునే వారు కూడా వైద్యులపై ఒత్తిడి తేవడం మరో కారణమని చెప్పవచ్చు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలకే ప్రాధాన్యం..

వరంగల్ మహాత్మాగాంధీ మెమోరియల్ ఆస్పత్రిలోని మెటర్నిటీ వార్డు, సీకేఎం ప్రసూతి ఆస్పత్రి, నర్సంపేటలోని జిల్లా ఆస్పత్రి, వర్ధన్నపేటలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సాధారణ ప్రసవాలకే ప్రాధాన్యం ఇస్తున్నారు. మూడేళ్లలో 17,731 ప్రసవాలు జరిగితే 7,188 సాధారణ, 10,543 సిజేరియన్లు చేశారు. 'నార్మల్ డెలివరీ చేస్తామని మేం చాలాసార్లు చెప్పినా గర్భిణులు, వారి కుటుంబ సభ్యులు వినరు. మేం వేరే ఆస్పత్రికి వెళ్లిపోతామని చెబుతారు. కొందరైతే సర్పంచ్‌లు, ఇతర పెద్దలతో ఫోన్లు చేయించి మాపై ఒత్తిడి తెస్తారు. వాళ్లకు నొప్పిలేని డెలివరీ కావాలి' అని పేరు చెప్పడానికి ఇష్టపడని ఓ ప్రభుత్వ వైద్యురాలు చెప్పారు. ప్రసవాల్లో ప్రజల్లో మార్పు రావాలని ప్రభుత్వ వైద్యులు సూచిస్తున్నారు.

ప్రభుత్వ ఆస్పతుల్లో ప్రసవాల వివరాలు..

సంవత్సరం	సాధారణం	సిజేరియన్లు
2022-23	2,900	3,908
2023-24	2,545	3,706
2024-25	1,743	2,929

ప్రైవేట్ ఆస్పతుల్లో ప్రసవాల వివరాలు

సంవత్సరం	సాధారణం	సిజేరియన్లు
2022-23	719	4,347
2023-24	740	4,496
2024-25	558	3,113

ప్రైవేట్ ఆస్పత్రుల్లో కోతలే ఎక్కువ..

ప్రైవేట్ ఆస్పత్రుల్లో మూడేళ్లలో 13,973 ప్రసవాలు జరిగితే 2,017 సాధారణ, 11,956 సిజేరియన్ ఆపరేషన్లు ఉన్నాయి. 'మేం సాధారణంగా నార్మల్ డెలివరీకి ట్రై చేస్తాం. కుదరకపోతేనే ఆపరేషన్లు చేస్తాం. ఇది వ్యక్తిని బట్టి మారుతుంది. అబార్షన్లు అయిన వారికి, ఎక్కువ వయస్సు, బీపీ, షుగర్ ఉండడం, ఐవీఎఫ్ పిల్లలు, అరుదైన కేసులు, ఆలస్యంగా గర్భం వచ్చిన కేసుల్లో ఆపరేషన్ వైపు మొగ్గు చూపుతాం. ప్రతీ కేసూ 24 గంటలు చూస్తాం. కాదంటే అప్పుడు సిజేరియన్ వెళ్లేవి ఎక్కువ. కొన్నిసార్లు 48 గంటలు చూసి కూడా సిజేరియన్‌కి వెళ్లాల్సి వస్తుంది. అలాంటప్పుడు వారి కుటుంబ సభ్యులు, బంధువులు అర్థం చేసుకోరు. మీకు ముందే తెలుస్తుంది కదా.. ఆపరేషన్ ఎందుకు చేయలేదు.. అని అడుగుతారు.. దీంతో డాక్టర్లు కూడా ముందే సిజేరియన్‌కి సిద్ధపడుతున్నారు. ప్రస్తుతం జిల్లాలోని చాలా ప్రైవేట్ ఆస్పత్రుల్లో 80 శాతంపైగా సిజేరియన్ రేటు ఉంది' అని ఓ సీనియర్ గైనకాలజిస్ట్ పేర్కొన్నారు.

సాధారణ ప్రసవానికి ముందుకు రావాలి..



చాలా మంది గర్భిణులు సిజేరియన్ చేయించుకుంటుండం ఆందోళన కలిగిస్తోంది. ఇది మహిళల ఆరోగ్యానికి శాపంగా మారింది. కుట్లు మానడం, ఇన్ఫెక్షన్ సమస్యలు ఈ ఆపరేషన్‌లో ఉంటాయి. కొందరికి గర్భాశయ సమస్యలు వస్తుంటాయి. బిడ్డ పుట్టిన వెంటనే తల్లి పాలు అందించడం సిజేరియన్‌లో వీలు పడదు. ఇది బిడ్డ ఇమ్యూనిటీకి కూడా ఇబ్బందికరమే. గర్భిణులు సాధారణ ప్రసవానికి ముందుకు రావాలి. కొందరు మంచి ముహూర్తాలు పెట్టుకొని ఆస్పత్రుల్లో డెలివరీలు చేయించుకున్నట్లు ఫిర్యాదు అందితే పోలీసులతో కలిసి మా శాఖ కూడా చర్యలు తీసుకుంటుంది.

- బి.సాంబశివరావు, డీఎంహెచ్ఓ

మనసారా మొక్కులు

ఘనంగా మండమెలిగె.. అమ్మవార్లకు పూజలు



సమ్మక్క గద్దె వద్ద భక్తుల రద్దీ





సమ్మక్క గుడిలో గద్దెను అలికి ముగ్గులేస్తున్న ఆడపడుచులు, నీళ్లు, శాక ఆరబోస్తున్న పూజారులు

మినీ మేడారం జాతర షురూ అయ్యింది. మేడారం, కన్నెపల్లిలో బుధవారం మండమెలిగె పండుగ ఆదివాసీ సంస్కృతీ సంప్రదాయం ప్రకారం వైభవంగా జరిగింది. సమ్మక్క-సారలమ్మ పూజారులు అమ్మవార్ల ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవార్లను దర్శించుకునేందుకు బుధవారం వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ఉదయం నుంచే మొదలైన భక్తుల తాకిడి మధ్యాహ్నం వరకు కొనసాగింది. జంపన్నవాగు వద్ద షవర్ల కింద స్నానాలు ఆచరించి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. - ఎస్ఎస్ తాడ్వాయి

- వివరాలు 8లో▸



పూజాసామగ్రితో రాత్రి సమ్మక్క గుడినుంచి గద్దెల వద్దకు బయలుదేరిన పూజారులు

గుట్కాలు స్వాధీనం

పర్వతగిరి: నిషేధిత గుట్కాలు, అంబర్ ప్యాకెట్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మండల కేంద్రంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం దాడులు చేసి కొల్లూరి శంకర్ వద్ద రూ.75,150, దారం సోమనాథం వద్ద రూ.11,200 విలువ గల గుట్కాలు, అంబర్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ మధుసూదన్ తెలిపారు. దాడుల్లో సీఐ రాజు, సిబ్బంది భానుప్రకాశ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేతల బాహాబాహీ

కాంట్రాక్టు పనుల బిల్లుల కోసం పరస్పర దాడులు

- గాయాలతో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న నాయకులు
- నల్లబెల్లి మండల కేంద్రంలో ఘటన

నల్లబెల్లి: బీఆర్ఎస్ నాయకులు ఇద్దరు బాహాబాహీకి దిగారు. మండల నాయకుల సమక్షంలో పరస్పరం దాడులు చేసుకుని గాయపడి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటన మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయం (మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి స్వగృహం)లో బుధవారం జరిగింది. స్థానికులు కథనం ప్రకారం.. నల్లబెల్లి మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి కోటిలింగాచారి, లెంకాలపల్లి మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ నాయకుడు గన్నెబోయిన చేరాలు ఐదేళ్ల క్రితం ములుగు జిల్లాలో మిషన్ కాకతీయ అభివృద్ధి కాంట్రాక్టు పనులు చేశారు. ఇందుకోసం పెట్టుబడి పెట్టారు. ఈ లెక్కలకు సంబంధించిన వివాదం నాలుగేళ్లుగా కొనసాగుతోంది. పలు సందర్భాల్లో బీఆర్ఎస్ నాయకుల సమక్షంలో జరిపిన చర్చలు సఫలం కాలేదు. కాగా, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి కార్యాలయంలో నిర్వహించిన సమావేశం అనంతరం సమస్య పరిష్కరించేందుకు మండల నాయకులు ప్రయత్నించారు. ఈ క్రమంలో గన్నెబోయిన చేరాలు ఆగ్రహంతో కుర్చీతో కొత్తపల్లి కోటిలింగాచారిపై దాడికి పాల్పడగా.. చేరాలుపై కోటిలింగాచారి ప్రతిదాడి చేశాడు. ఈ దాడిలో కోటిలింగాచారి కుడి కాలు విరగగా హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరాడు. చేరాలు ఎడమ చేయి విరగడంతో నర్సంపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి, మాజీ ఎంపీపీ కక్కెర్ల శ్రీనివాస్‌గౌడ్, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు ఊడుగుల ప్రవీణ్ గౌడ్ సమక్షంలోనే ఈ ఘటన చోటు చేసుకోవడం గమనార్హం. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి గొడవకు సంబంధించిన కారణాలపై ఆరాతీశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కోటిలింగాచారిని పరామర్శించారు.

ఆర్ఎంఓలు లేక అస్తవ్యస్తం

- ఎంజీఎం ఆస్పత్రిలో పరిపాలన అధికారుల కొరత
- ఖాళీగా ఉన్న రెండు పోస్టుల భర్తీలో జాప్యం

ఎంజీఎం: ఎంజీఎం ఆస్పత్రిని కొన్ని నెలలుగా పరిపాలనాధికారుల కొరత వేధిస్తోంది. మూడు నెలలుగా ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌గా కొనసాగిన డాక్టర్ కిశోర్‌కు ఇటీవల పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించేలా కలెక్టర్ సత్య శారద ప్రత్యేక కృషి చేశారు. ఆర్ఎంఓ-1, ఆర్ఎంఓ-2 బాధ్యతలను డిప్యూటీ సివిల్‌సర్జన్‌గా పనిచేస్తున్న డాక్టర్ మురళి కొనసాగించే వారు. ప్రస్తుతం ఆయనను బదిలీ చేయడంతో ఎంజీఎం ఆస్పత్రిలో ఆర్ఎంఓ-1, ఆర్ఎంఓ-2 కీలకమైన పోస్టులు ఖాళీ అయ్యాయి. దీంతో ఆస్పత్రి నిర్వహణ బాధ్యతలు ఎవరు నిర్వర్తిస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది.



వివాదాలకు కేంద్రంగా పాలనా విభాగం..

ఎంజీఎం ఆస్పత్రి పాలనా విభాగం నిత్యం వివాదాలకు కేంద్రంగా మారుతోంది. గత పరిపాలనాధికారులు చేసిన తప్పిదాలు ప్రస్తుతం కొనసాగుతున్న అధికారులకు తలనొప్పిగా మారాయి. మంజూరైన 35 పోస్టులు మా ఆస్పత్రికి వద్దంటూ గత అధికారులు ప్రభుత్వానికి లేఖలు రాశారు. దీంతో ప్రస్తుతం 35 మంది ఉద్యోగులకు కొన్ని నెలలుగా వేతనాలు రావడం లేదు. ఈ విషయంపై కొంత మంది రాష్ట్ర మంత్రులకు సైతం ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. అంతేకాకుండా కొంతమంది మినిస్టీరియల్ సిబ్బంది ఇష్టారాజ్యంగా విధులకు రావడం, ఆర్థిక వ్యవహారాల్లో తలదూర్చడం, రాజకీయ ఒత్తిళ్లతో పరిపాలనాధికారులను శాసించే స్థాయికి ఎదగడం అధికారులకు ఇబ్బందిగా మారింది. ఈ క్రమంలో మూడు రోజుల క్రితం ఎంజీఎం ఆస్పత్రికి త్రీమెన్ కమిటీ విచారణకు వచ్చినట్లు చర్చ జరుగుతోంది.

డీఎంఈ దృష్టికి తీసుకెళ్తా..

డిప్యూటేషన్ కాలపరిమితి ముగియడంతో ఆర్ఎంఓ-2 డాక్టర్ మురళిని బదిలీ చేశాం. ఆస్పత్రిలో ఎవరైనా పరిపాలన విభాగంలో పనిచేసేందుకు ఇష్టం ఉంటే ముందుకు రావాలని కోరాం. ఆస్పత్రిలో పరిపాలనాధికారుల కొరత విషయంపై డీఎంఈ దృష్టికి తీసుకెళ్తా.

- సూపరింటెండెంట్, కిశోర్

పారదర్శకంగా ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి

వరంగల్: వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్, డిప్యూటీ ఎన్నికల అధికారి జి.సంధ్యారాణి అన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పీఓలు, ఓపీఓల శిక్షణ కార్యక్రమం బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం జారీ చేసిన పీఓ హ్యాండ్‌బుక్‌ను సంపూర్ణంగా చదవాలని సూచించారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించేందుకు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అంతేకాకుండా బ్యాలెట్ బాక్సులు ముందే తనిఖీ చేసుకోవాలని, పోలింగ్‌కు ముందే ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్సులు తెరిచి చూపించాలని, అప్పుడే ఎన్నికలను పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు వారికి తెలుస్తుందని వివరించారు.



శిక్షణలో పాల్గొన్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి

డిక్లరేషన్, పోల్ ప్రారంభం వంటి అంశాలపై జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రాధాన్యతా క్రమంలో ఓటర్లు ఓటు వేసేందుకు ఎన్నికల కమిషన్ అంగీకరించిన వైలెట్ కలర్ స్కెచ్‌పెన్ మాత్రమే వాడాలని, ఈ విషయం ముందే ఓటర్లకు తెలియజేయాలని చెప్పారు. స్టాట్యూరీ, నాన్ స్టాట్యూరీ కవర్లపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, డీఆర్ఓ విజయలక్ష్మి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి, ట్రైనింగ్ నోడల్ అధికారి బాలకృష్ణ, సూపరింటెండెంట్ రంజిత్, ఎన్నికల శిక్షకులు, పీఓలు, ఓపీఓలు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి



సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్ఓ సాంబశివరావు

గీసుకొండ: ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని డీఎంహెచ్ఓ సాంబశివరావు వైద్యాధికారులకు సూచించారు. క్రిస్టియన్‌కాలనీలోని బస్తీ దవాఖాన, గీసుకొండలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు చేయాలని, వ్యాధి నిరోధక టీకాలు అందించాలని పేర్కొన్నారు. సంక్రమిత, అసంక్రమిత వ్యాధుల నిర్ధారణ పరీక్షలు నిర్వహించి మెరుగైన చికిత్స అందించాలన్నారు. ఆరోగ్య సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. సమయపాలన పాటించని అధికారులు, సిబ్బందిపై చర్యలు ఉంటాయని డీఎంహెచ్ఓ హెచ్చరించారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ అరుణ్‌కుమార్, డాక్టర్ వేదవి, డెమో అనిల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక మాఫియాపై కఠిన చర్యలు

- పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



ఆకేరువాగులో ఇసుక డంపును పరిశీలిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

వర్ధన్నపేట: ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని వరంగల్ పోలీస్ అంబర్ కిషోర్ ఝా హెచ్చరించారు. కొత్తపల్లి, ల్యాబర్తిలోని ఆకేరు వాగులో ఇసుక ర్యాంపులు, ఇసుక ఫిల్టర్ యంత్రాలను బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఇసుక ఫిల్టర్ చేసే విధానాన్ని పోలీసు అధికారులు సీపీకి వివరించారు. ఈ సందర్భంగా సీపీ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ ఇసుక మాఫియాపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అక్రమ మైనింగ్‌తో పర్యావరణం దెబ్బతిని, భూగర్భ జలాలు అడుగంటి తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందని తెలిపారు. వర్ధన్నపేట మండల పరిధిలో కొన్నాళ్లుగా ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతుందని తన దృష్టికి వచ్చిందన్నారు. అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలతోపాటు నిరంతరం పోలీసుల పటిష్టమైన నిఘా ఉంటుందని ఆయన తెలిపారు. సీపీ వెంట ఏసీపీ అంబటి నర్సయ్య, సీఐ శ్రీనివాసరావు, ఎస్సైలు చందర్, రాజు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

క్లుప్తంగా

రన్నింగ్ స్టాఫ్ సమస్యలు పరిష్కరించాలి



ఎం.ఎస్.ప్రసాద్ చిత్రపటానికి పూలతో శ్రద్ధాంజలి ఘటిస్తున్న హనుమయ్య

కాజీపేట రూరల్: రైల్వేలో అతి ప్రధాన రన్నింగ్ స్టాఫ్ (లోకో పైలెట్లు, అసిస్టెంట్ లోకో పైలెట్లు, గార్డులు) సమస్యలు పరిష్కరించాలని ఆల్ ఇండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ (ఏఐఎల్ఆర్ఎస్ఏ) సెంట్రల్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ టి.హనుమయ్య డిమాండ్ చేశారు. కాజీపేట రైల్వే కమ్యూనిటీ హాల్‌లో బుధవారం ఏఐఎల్ఆర్ఎస్ఏ డివిజనల్ స్పెషల్ కన్వెన్షన్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన హనుమయ్య ముందుగా ఎం.ఎస్. ప్రసాద్ చిత్రపటానికి పూల మాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 7వ పే కమిషన్ సిఫార్సుల ప్రకారం రన్నింగ్ స్టాఫ్‌కు రన్నింగ్ అలవెన్స్ 25 శాతం పెంచాలని డిమాండ్ చేశారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే జోనల్ ప్రెసిడెంట్ చౌబే, సెంట్రల్ కమిటీ జాయింట్ సెక్రటరీ ఆర్ కె.రాణా, సౌత్ సెంట్రల్ రైల్వే సికింద్రాబాద్ జోనల్ సెక్రటరీ ఇరానీ పాషా, సికింద్రాబాద్ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు ఏవీఎస్ఎన్ ఎన్.మూర్తి, ఆర్.ఎస్.శ్రీజిత్ రన్నింగ్ స్టాఫ్ సమస్యలపై మాట్లాడారు. అంతకు ముందు డివిజనల్ సెక్రటరీ ఆర్ఎస్.శ్రీజిత్ ఏఐఎల్ఆర్ఎస్ఏ జెండాను ఎగురవేశారు. సమావేశంలో సికింద్రాబాద్ డివిజన్, కాజీపేట బ్రాంచ్‌కు చెందిన 150 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఒకరి మృతి

నర్సింహులపేట: మండలంలోని రామన్నగూడేనికి చెందిన దుండి ఉప్పలయ్య(45) చేపలు పట్టడానికి వెళ్లి విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందినట్లు ఎస్సై మాలోతు సురేశ్ తెలిపారు. రామన్నగూడెం సమీపంలోని వెంకమ్మ చెరువు మత్తడి దగ్గరలోని గుంతలో బుధవారం కరెంట్‌తో చేపలు పట్టే క్రమంలో వైరు తెగి ఉండడాన్ని చూసుకోకపోవడంతో షాక్‌కు గురై మృతి చెందాడు. మృతుడి భార్య మంజుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పవర్‌ఫుల్!



ఉమ్మడి జిల్లాలో పెరిగిన విద్యుత్ వినియోగం

- దంచి కొడుతున్న ఎండలు, వాతావరణంలో మార్పులే కారణం
- డిమాండ్‌ను ఎదుర్కొనేందుకు విద్యుత్ శాఖ ప్రత్యేక ప్రణాళిక
- ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంపు

హన్మకొండ: వాతావరణంలో మార్పులు కనిపిస్తున్నాయి. చలి పెట్టాల్సిన సమయంలో ఉక్కపోత మొదలైంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎండలు దంచికొడుతున్నాయి. ఉదయం కొద్దిగా చల్లని వాతావరణం ఉండడంతో వేడి నీటి కోసం గీజర్లు వాడుతున్నారు. పగలు ఎండలు దంచికొడుతుండడంతో ఫ్యాన్లు, ఏసీల వాడకం పెరిగిపోయింది. మరో వైపు ముందుగా నాట్లు వేసిన వరి పంట పొట్ట దశకు రావడంతో నీటి కోసం భూగర్భ జలాల వినియోగం పెరిగింది. ఈక్రమంలో విద్యుత్ డిమాండ్ పెరిగింది.

మొత్తం సర్వీస్‌లు ఎన్నంటే..

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 5 సర్కిళ్ల పరిధిలో 18,36,370 విద్యుత్ సర్వీస్‌లున్నాయి. ఇందులో గృహ వినియోగదారులు 12,50,009, కమర్షియల్ 152148, పరిశ్రమలు 8,925, కుటీర పరిశ్రమలు 2,092, వ్యవసాయ 3,92,879, వీధి దీపాలు 21,280, ఇతర సర్వీస్‌లు 9,037 ఉన్నాయి. హనుమకొండ సర్కిల్‌లో అన్ని సర్వీస్‌లు కలిపి 4,84,208 ఉన్నాయి. వరంగల్‌లో 4,19,318, జనగామలో 2,92,650, భూపాలపల్లి 3,00,346, మహబూబాబాద్ సర్కిల్‌లో అన్ని సర్వీస్‌లు కలిపి 3,39,848 ఉన్నాయి.

ప్రత్యేక ప్రణాళిక..

వాతావరణ పరిస్థితులను ముందుగానే అంచనా వేసిన టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం ఈసారి వేసవిపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈవేసవిలో విద్యుత్ డిమాండ్, వినియోగం భారీగా పెరగనుందనే ఆలోచనతో ప్రత్యేకంగా వేసవి ప్రణాళిక రూపొందించారు. ఫిబ్రవరి చివరి నాటికి వేసవి ప్రణాళికను పూర్తిగా కార్యరూపంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకున్నారు. ఈమేరకు డిమాండ్‌ను బట్టి 33/11 కేవీ సబ్ స్టేషన్లలో అధిక సామర్థ్యం కలిగిన పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి సబ్ స్టేషన్ సామర్థ్యాన్ని పెంచారు. అధిక భారం ఉన్న డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో అధిక సామర్థ్యం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను అమర్చడంతో పాటు అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. అధిక భారం ఉన్న ఫీడర్లను గుర్తించి లోడ్ బదలాయింపు చేస్తున్నారు. విద్యుత్ అంతరాయాలను నివారించేందుకు సబ్ స్టేషన్లను అనుసంధానిస్తూ ప్రత్యామ్నాయ విద్యుత్ లైన్ వేస్తున్నారు. ఏదైనా సబ్ స్టేషన్‌లో సమస్య ఉత్పన్నమైతే మరో సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా అందించేందుకు ఈప్రత్యామ్నాయ విద్యుత్ లైన్లు ఉపయోగపడనున్నాయి. ప్రతీ జిల్లాకు ప్రత్యేకంగా చీఫ్ ఇంజనీర్, జనరల్ మేనేజర్ స్థాయి అధికారులను నోడల్ ఆఫీసర్లుగా నియమించి వేసవిలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా నాణ్యమైన, మెరుగైన విద్యుత్ సరఫరా చేసేందుకు టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం అన్ని చర్యలు తీసుకుంటోంది.

విద్యుత్ వినియోగం (మిలియన్ యూనిట్లలో)

జిల్లా	ఫిబ్రవరి 7న	8న	9న	10న	11న					
(సర్కిల్)	2024	2025	2024	2025	2024	2025	2024	2025	2024	2025
హనుమకొండ	4.85	5.08	4.73	5.08	4.86	4.97	4.94	4.91	4.80	4.93
వరంగల్	3.95	4.27	3.83	4.15	3.99	4.41	3.88	4.36	4.80	4.31
జనగామ	5.23	5.55	5.29	5.39	5.40	5.51	5.31	4.96	5.12	5.60
మహబూబాబాద్	3.72	4.22	3.85	4.13	3.80	4.26	3.82	4.20	3.68	4.04
భూపాలపల్లి	7.22	7.79	7.15	7.65	7.10	7.96	7.11	8.20	6.81	8.26

విద్యుత్ డిమాండ్ (మెగావాట్లలో)

జిల్లా	ఫిబ్రవరి 7న	8న	9న	10న	11న					
(సర్కిల్)	2024	2025	2024	2025	2024	2025	2024	2025	2024	2025
హనుమకొండ	283	329	281	317	305	308	301	323	292	327
వరంగల్	267	316	266	306	279	315	277	297	268	360
జనగామ	279	306	273	318	284	270	282	308	273	292
మహబూబాబాద్	322	389	331	383	346	388	344	389	317	360
భూపాలపల్లి	354	367	345	364	352	390	342	379	332	386

ఉమ్మడి జిల్లాలో విద్యుత్ సరఫరా డిమాండ్ (మెగావాట్లలో)

ఫిబ్రవరి	2024	2025
7	1,179	1,440
8	1,181	1,412
9	1,249	1,389
10	1,236	1,410
11	1,184	1,352

వీడిన హత్య కేసు మిస్టరీ

- రెండేళ్ల క్రితం ధర్మారం శివారులో లభ్యమైన వృద్ధురాలి మృతదేహం
- హత్యగా కేసు నమోదు.. కీలక ఆధారాలు లభ్యం
- పోలీసుల ఎదుట లొంగిపోయిన నిందితుడు.. కారు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ రవీందర్

పరకాల: రెండేళ్ల క్రితం నడికూడ మండలం ధర్మారం శివారులో జరిగిన వృద్ధురాలి హత్య కేసు మిస్టరీ వీడింది. వృద్ధురాలి కన్నకొడుకు సన్నిహితుడే హత్యకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో తేలగా.. నిందితుడు పరకాల పోలీసుల ముందు లొంగిపోగా.. బుధవారం అరెస్ట్ చేశారు. హత్యకు సంబంధించిన వివరాలను వరంగల్ ఈస్ట్‌జోన్ డీసీపీ పి.రవీందర్ పరకాల ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. శాయంపేట మండలం ఆరెపల్లి గ్రామానికి చెందిన వాడికాల బొందమ్మకు నలుగురు సంతానం. ఒక కొడుకు, ముగ్గురు కూతుళ్లు. తనకున్న 10 గుంటల భూమిని కొడుకుకు కాదని.. కూతుర్లకు ఇస్తానని గ్రామంలో జరిగిన పంచాయితీలో చెప్పడమే ఆమెకు శాపమైంది. కొడుకుకు ఇవ్వాలని అదే గ్రామానికి చెందిన ఇంటి రాజిరెడ్డి వృద్ధురాలితో వాదించాడు. ఆవిషయాన్ని మనసులో పెట్టుకున్న వృద్ధురాలు పంచాయితీ జరిగిన మరుసటి రోజు 2023 మార్చి26న రాజిరెడ్డి ఇంటికి వెళ్లి తమ కుటుంబంలో చిచ్చు పెడుతున్నావంటూ శాపనార్థాలు పెడుతూ దూషించింది. దీంతో ఆగ్రహించిన రాజిరెడ్డి ఇంటి చుట్టు పక్కల ఎవరూ లేకపోవడంతో వృద్ధురాలిని చితకబాది హత్య చేశాడు. అంతటితో ఊరుకోకుండా మృతదేహంపై ఉన్న బంగారు గాజులు, మెడలోని బంగారు గొలుసు, కమ్మలు దోచుకొని ఎడ్ల కొట్టంలో దాచిపెట్టాడు. తర్వాత మృతదేహాన్ని తన కారులో వేములవాడ వైపు తీసుకెళ్లి.. మళ్లీ అదే రాత్రి హుజూరాబాద్, నడికూడ మీదుగా ధర్మారం శివారులోని కెనాల్ కల్వర్టు వద్ద పడేసి వెళ్లిపోయాడు. గ్రామస్తులు అందించిన సమాచారంతో ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు హత్యగా కేసు నమోదు చేశారు. వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝూ ఆదేశాల మేరకు వృద్ధురాలి హత్య కేసును సీరియస్‌గా తీసుకొని విచారణ జరపగా ఆమె సొంత గ్రామానికి చెందిన ఇంటి రాజిరెడ్డే హత్య చేసినట్లు పోలీసులకు కీలక ఆధారాలు లభ్యమయ్యాయి. నిందితుడి కోసం గాలిస్తుండగా పరకాల పోలీసుల ముందు మరొకరి సాయంతో లొంగిపోయాడు. వృద్ధురాలి నుంచి దోచుకున్న బంగారాన్ని వరంగల్‌లోని ఓ జ్యువెల్లరీలో కరిగించి కడెం చేయించుకున్నాడు. కొద్ది రోజులకు తన అవసరాల కోసం ఓ ఫైనాన్స్‌లో తాకట్టుపెట్టినట్లు పోలీసుల విచారణలో తేలినట్లు డీసీపీ రవీందర్ వెల్లడించారు. నిందితుడి నుంచి కారును స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. హత్య కేసును ఛేదించిన పరకాల, శాయంపేట సీఐలు క్రాంతికుమార్, రంజిత్‌రావు పోలీసు బృందాన్ని డీసీపీ రవీందర్, ఏసీపీ సతీశ్‌బాబు అభినందించారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరికి జైలు

లింగాలఘణపురం: మండలంలోని కుందారం సమీపంలో 2019లో దేవరుప్పుల మండలం రామచంద్రగూడేనికి చెందిన కైరిక ఆంజనేయులుపై హత్యాయత్నం జరిగింది. ఈఘటనకు కారకులైన అదే గ్రామానికి చెందిన కైరిక భాస్కర్, నాగన్నకు మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.5వేలు జరిమానా విధిస్తూ అసిస్టెంట్ సెషన్ జడ్జి సుచరిత బుధవారం తీర్పు చెప్పినట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఆంజనేయులు, భాస్కర్, నాగన్న మధ్య చిట్టీ డబ్బుల విషయంలో గొడవలున్నాయి. ఈనేపథ్యంలో ఆంజనేయులును చంపాలని పథకం ప్రకారం బైక్‌పై వెళ్తున్న అతడిని భాస్కర్, నాగన్న కుందారం సమీపంలో సుమోతో ఢీకొట్టారు. తలకు తీవ్ర గాయాలైన ఆంజనేయులు ప్రాణాలతో బయటపడ్డాడు. ఈఘటనకు సంబంధించి ఆంజనేయులు బంధువులు చిక్కుడు భాస్కర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. అప్పటి ఎస్సై ఎస్.రవీందర్ కేసు నమోదు చేశారు. కోర్టు కానిస్టేబుల్ నరేశ్ నిందితులకు శిక్షపడేలా సాక్ష్యాలను ప్రవేశపెట్టినట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు.

పగిడిద్దరాజు ఆలయంలో ప్రత్యేక పూజలు



ముస్తాబైన పగిడిద్దరాజు ఆలయం

గంగారం: మేడారం మినీ జాతర ప్రారంభం కావడంతో మహబూబాబాద్ జిల్లా గంగారం మండలంలోని పూనుగొండ్ల గ్రామంలోని పగిడిద్దరాజు ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధానార్చకులు, మహిళలు ఉపవాసం ఉండి ఆలయాన్ని శుద్ధి చేశారు. ఆలయాన్ని అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మినీ జాతరకు పూజారులు, వడ్డెలు బయల్దేరి వెళ్లారు.

సమ్మక్కకు చెలపేయ మొక్కులు



సమ్మక్క పూజారులకు చెలపేయను అప్పగిస్తున్న చెర్ప వంశస్తులు

ఎస్ఎస్ తాడ్వాయి: మండలంలోని ఊరట్టం గ్రామానికి దివంగత మాజీ చెర్ప భోజారావు ఆనవాయితీని కొనసాగిస్తూ ఆయన కుటుంబీకులు మండమెలిగె పండుగ రోజున సమ్మక్క పూజారులకు చెలపేయను అప్పగించారు. పూజారులు గద్దెల చుట్టూ చెలపేయతో ప్రదక్షిణలు నిర్వహించారు. ఊరట్టం ఆశ్రమ పాఠశాల విద్యార్థుల ఆదివాసీ సంప్రదాయ నృత్యాలు అలరించాయి. కాగా.. చెర్ప భోజారావు కుమార్తెలు, అల్లుళ్లు మాజీ ఎంపీపీ గొంది వాణిశ్రీ-సత్యనారాయణ, గొంది జయశ్రీ - కే.శే వీరయ్య, కాక అరుణ-మాధవరావుతో పాటు ఆ గ్రామానికి చెందిన చెర్ప వంశీయులు ఈమొక్కు కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.

తప్పిపోయిన తండ్రి కోసం వెతుకులాట



ములుగు: సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం జనగామ గ్రామానికి చెందిన జంగిడి వెంకటయ్య 2024లో జరిగిన మేడారం మహా జాతరలో తప్పిపోయాడు. కుమారుడు రాము తోడుగా వచ్చిన బంధువులు, గ్రామస్తులు ఎంత వెతికినా ఆచూకీ దొరకలేదు. తండ్రి ఫొటోతో ఫ్లెక్సీ తయారు చేయించి ఈసారి జరుగుతున్న మినీ మేడారం జాతరలో రాము వెతకడం ప్రారంభించాడు. జంపన్న వాగు, ఐటీడీఏ క్యాంపు కార్యాలయం, అమ్మవారి ప్రవేశ మార్గం ఎదుట భక్తులకు ఫ్లెక్సీ చూపిస్తూ తన తండ్రి కనిపిస్తే ఆచూకీ తెలపాలని వేడుకుంటూ కనిపించాడు. వివరాలు తెలిస్తే 79954 54146 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరుతున్నాడు.



జంపన్నవాగులో షవర్ల వద్ద స్నానాలాచరిస్తున్న భక్తజనం



జాతరలో భక్తుల కోలాహలం

మనసారా మొక్కులు







పసుపు, కుంకుమతో సమ్మక్క గుడికి వెళ్తున్న పూజారులు, సమ్మక్క గుడిలోపల శక్తి పీఠాన్ని అలికి ముగ్గులు వేసిన ఆడపడుచులు

ఘనంగా మండమెలిగె పండుగ

- అమ్మవార్లకు ప్రత్యేక పూజలు
- మేడారంలో జన సందడి
- తరలివచ్చిన వేలాది మంది భక్తులు



సారలమ్మ గద్దె వద్ద మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

ఎస్ఎస్ తాడ్వాయి: మేడారం, కన్నెపల్లిలో బుధవారం మండమెలిగె పండుగ ఆదివాసీ సంస్కృతీ సంప్రదాయం ప్రకారం వైభవంగా జరిగింది. సమ్మక్క సారలమ్మల పూజారులు అమ్మవార్ల ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం ఉదయం ఆలయాలను శుద్ధి చేసిన పూజారులు మండమెలిగె పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. మేడారంలోని సమ్మక్క గుడిలో అమ్మవారి శక్తి పీఠాన్ని అలికి సిద్ధంగా ఉంచగా, సమ్మక్క పూజారి సిద్ధబోయిన మునీందర్ ఇంటి నుంచి ఆడపడుచులు, పూజారులు డోలు వాయిద్యాల నడుమ పసుపు, కుంకుమలను తీసుకొని గుడికి చేరుకున్నారు. అమ్మవారి శక్తి పీఠాన్ని, గుమ్మాలను పసుపు, కుంకుమలతో అందంగా అలంకరించారు. అనంతరం సమ్మక్క పూజారి సిద్ధబోయిన నితిన్ ఇంటి నుంచి పవిత్ర జలం, పసుపు, కుంకుమలను తీసుకొని పోచమ్మగుడికి వెళ్లి చీర సమర్పించి పూజలు చేశారు. నితిన్ ఇంటి వద్ద తయారు చేసిన మామిడి తోరణాలను చిలుకులగుట్టకు వెళ్లే దారిలో రోడ్డుకిరువైపులా కర్రలకు కోడి పిల్ల, సొరకాయ, మిరపకాయ (దిష్టి తగలకుండా)ను కట్టి ధ్వజస్తంభాన్ని నిలిపారు. ధ్వజస్తంభం వద్ద దూప వడ్డె నాగేశ్వర్‌రావు, సమ్మక్క పూజారులు కొక్కెర కృష్ణయ్య, సిద్ధబోయిన నితిన్, సిద్ధబోయిన స్వామి, మల్లెల సత్యం నీళ్లారగించారు. ఈశాన్యం దిక్కున పొలిమెరలో ధ్వజస్తంభానికి కూడా మామిడి తోరణాలు కట్టి పూజలు చేశారు. బుధవారం రాత్రి సమ్మక్క పూజారులు పసుపు, కుంకుమ పూజా సామగ్రి తీసుకొని డోలు వాయిద్యాలతో సమ్మక్క గద్దెకు 11:23 గంటలకు చేరుకున్నారు. వీరికి రాష్ట్ర మంత్రి సీతక్క ఆడపడుచులతో కలిసి సమ్మక్క పూజారులకు ఎదురెళ్లి నీళ్లారగించారు. రాత్రి అమ్మవారి గద్దె వద్ద పూజారులు రహస్య పూజలు నిర్వహిస్తున్న సమయంలో ఆలయంలో విద్యుద్దీపాలను ఆర్పేశారు.

కన్నెపల్లిలో సారలమ్మకు పూజలు

కన్నెపల్లిలోని సారలమ్మ గుడిలో పూజారులు మండమెలిగె పండుగను ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే గుడిని శుద్ధి చేసి పసుపు, కుంకుమ, బంతిపూలతో అలంకరించారు. సారలమ్మ వడేరాల కుండలను అలంకరించారు. సారలమ్మ ప్రధాన పూజారి కాక సారయ్య అమ్మవారి పూజాసామగ్రిని శుద్ధి చేసి అలంకరణ అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి సమయంలో సారలమ్మ పూజారులతో పాటు గ్రామంలోని ఆదివాసీలంతా కలిసి గుడి నుంచి పసుపు, కుంకుమ, శాకహానం (ఇప్పపువ్వు సారా) తీసుకొని రాత్రి 11.07 గంటలకు గద్దెలకు చేరుకున్నారు. గద్దెల వద్ద రహస్య పూజలు నిర్వహించారు. అనంతరం సమ్మక్క సారలమ్మ పూజారులు కలిసి డోలు వాయిద్యాలతో గద్దెల వద్ద సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, పూజారులు సిద్ధబోయిన మునీందర్, భోజారావు, సిద్ధబోయిన స్వామి, అరుణ్, వసంతరావు, సారలమ్మ పూజారులు కాక కిరణ్, మేడారం జాతర చైర్మన్ అరెం లచ్చు పటేల్ పాల్గొన్నారు.

భక్తుల సందడి

మినీ మేడారం (మండమెలిగె) సందర్భంగా అమ్మవార్లను దర్శించుకునేందుకు వేలాదిగా భక్తులు తరలివచ్చారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర నుంచి ప్రైవేట్ వాహనాల్లో వేలాదిగా తరలివచ్చారు. జంపన్నవాగు వద్ద షవర్ల కింద స్నానాలు ఆచరించారు. భక్తుల తాకిడి పెరిగినప్పటికీ క్యూలైన్ ద్వారా గద్దెల పైకి అనుమతించడంతో భక్తులు అమ్మవార్లను తనివితీరా దర్శించుకున్నారు. డీఎస్పీ రవీందర్ పర్యవేక్షణలో పస్రా సీఐ రవీందర్, తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది భారీ బందోబస్తు నిర్వహించారు. ఎక్కడ కూడా ట్రాఫిక్ జామ్ జరగకుండా వాహనాలను పార్కింగ్ స్థలాల్లోకి మళ్లించారు. మొక్కుల అనంతరం భక్తులు మేడారంలోని చిలకలగుట్ట, ఆర్టీసీ బస్టాండ్, శివరాంసాగర్, జంపన్నవాగు, తదితర ప్రాంతాల్లో విడిది చేసి సందడి చేశారు. మినీ జాతర సందర్భంగా భక్తుల తాకిడితో మరోసారి వనమంతా సందడి కనిపించింది.



తలనీలాలు సమర్పిస్తున్న భక్తులు



ముగ్గులు వేస్తున్న ఆడపడుచులు



సమ్మక్క పూజారులకు నీళ్లు ఆరబోసేందుకు ఆడపడుచులతో కలిసి ఉన్న మంత్రి సీతక్క



బంగారం తీసుకొస్తున్న భక్తులు



బంతి భోజనం చేస్తున్న కుటుంబసభ్యులు